'వెన్నుపోటు'పై విచారణ

- సింగరేణి క్రీడాకారుని పేరు తొలగింపుపై సీఎండీ ఆరా
- విజిలెన్స్ విచారణకు ఆదేశం
- 'నమస్తే' కథనానికి స్పందన

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : కోల్ ఇండియా క్రీడలకు ఎంపికైన భూపాలపల్లి సింగరేణి క్రీడాకారునికి జరిగిన అన్యాయంపై విచారణ ప్రారంభమైంది. బానోత్ రమేశ్ పేరును ఆర్‌జీ -1 సూపర్‌వైజర్ పెంచ్ రమేశ్ తొలగించి మరో పేరు చేర్చడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ'లో సోమవారం 'సింగరేణి క్రీడాకారుడికి వెన్నుపోటు' కథనం ప్రచురితమవడంతో సింగరేణి వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విషయంపై సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఆరా తీశారు. కోల్ ఇండియాకు ఎంపికైన రమేశ్ పేరును ఎలా తొలగించారు? కారకులు ఎవరు అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా బాధిత క్రీడాకారుడు రమేశ్ సోమవారం ఆర్‌జీ -1 సూపర్‌వైజర్ హెచ్ రమేశ్ తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తి పేరు చేర్చారని, దీంతో తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంలో భూపాలపల్లి సూపర్‌వైజర్ శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆర్ జీ -1 సూపర్‌వైజర్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రమేశ్ వేడుకున్నాడు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థుల ఎంపిక

చిట్యాల : విద్యార్థిని అభినందిస్తున్న టీచర్లు, గ్రామస్తులు

గణపురం/ చిట్యాల/మల్హర్/ మొగుళ్లపల్లి, డిసెంబర్ 9 : జిల్లా కేంద్రంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో గణపురం మండలం చెల్పూరు ఎంజేపీఎం పాఠశాల, చిట్యాల మండలం జూకల్ ఉన్నత పాఠశాల, మొగుళ్లపల్లి మండలం కొరికిశాల మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆరో తరగతి విద్యార్థి రిత్విక్ 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర, ఉప అంశం వ్యవసాయం సేంద్రీయ పద్ధతులు' అనే అంశంలో జూనియర్ విభాగంలో, పదో తరగతి విద్యార్థిని కొరండ్ల సిరి చందన జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చింది. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం శాలువాతో సన్మానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎంజేపీఎం స్కూల్ కరస్పాండెంట్ గ్యాదంగి సతీశ్, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు చిర్రయాకేశ్ గౌడ్, శిరీష, కావ్య, డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్, గైడ్ టీచర్ డాక్టర్ మర్క వీణావాణి, మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు దొంతి రాంరెడ్డి, పోలోజు సంతోష్, సాయి సేవాసమితి సాయిరెడ్డి, సుర నరేందర్, కొడారి రవి, ఉపాధ్యాయులు ఉమాదేవి, రంజిత్ కుమార్, స్వరూప, రవీందర్, యోగానంద చారి, రామకృష్ణ, ప్రసాద్, కొర్కిశాల పాఠశాల హెచ్ఎం తాళ్లపల్లి రాకేశ్, వైస్ ప్రిన్సిపాల్ రఘుపతి, పాల్గొన్నారు. అలాగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మల్హర్ మండలం రుద్రారం పాఠశాల విద్యార్థులు అంజన్‌కుమార్, హరీశ్‌లు అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లాలో తృతీయ బహుమతి గెలుపొందారు. వారితో పాటు గైడ్ టీచర్ సమ్మయ్య హెచ్ఎం లక్ష్మణ్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

మాట్లాడుతున్న పోరిక గోవింద్‌నాయక్

జీపీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ములుగురూరల్, డిసెంబర్ 9 : గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, బిల్లులు అడిగితే మాజీ సర్పంచులను అరెస్టు చేయడం సరికాదని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు, అక్రమ నిర్బంధాలతో పరిపాలన కొనసాగించడమే కాకుండా జీపీలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, జీపీలకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. అసెంబ్లీ వేదికగా సమస్యలను చెప్పుకునేందుకు వెళ్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం అప్రజాస్వామికమని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 500 జనాభా పైబడిన తండాలు, గూడేలను జీపీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వలేని పరిస్థితి ఉందని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు భూక్యా పాపా పవన్‌కుమార్, గుగులోత్ తిరుపతి, మోరె రాజన్న, మాలోత్ యాకూబ్‌నాయక్, గుగులోత్ రామల్, పోరిక బాబూరావు, మాలోత్ రవీందర్, రాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★I, ANKALLA ANITHA (Old Name) H.No.3-160 Venkatraopalli (B), Tekumatla Mdl, Jayashankar Bhupalpally Dist-506356, T.S. Changed my name as ANKALLA VANITHA W/o ANKALLA SWAMY (New Name). for all purpose.
NTW-000

పేరు మార్పు
నేను అనగా మహేందర్ కర్ర, తండ్రి: దశరథం కర్ర, వ: 45 సంంలు, వృత్తి: వ్యవసాయం, నివాసం : ఇం.నెం. 2-111, గ్రామం : ములకపల్లి, మండలం: మొగుళ్లపల్లి, జిల్లా: జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ. పిన్: 506366. నా పూర్వపు పేరయిన మహేందర్ కర్ర వాడకాన్ని మార్చుకుంటున్నాను. కావున ఇప్పటి నుండి నా పేరు కర్ర మహేందర్ రెడ్డి గా మార్చబడుచున్నది. దీని ప్రకారమే ఇక మీదట నాయొక్క రికార్డులలో మరియు లావాదేవీలలో ఈ పేరు ప్రకారమే జరుపబడును.
- కర్ర మహేందర్ రెడ్డి

SKY ASSOCIATES- WANTED
★Area collection executives, Telecallers, Experience is not required Locations: Warangal, Narsampet, Wardhannapeta, Thorrur, Parkal, Mulugu, Ghanpur,-Cont 9491465729
NTW-332306

WANTED
★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి

అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, మహేందర్‌జీ

భూపాలపల్లి రూరల్ : ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

ములుగు రూరల్ : ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్/ డిసెంబర్ 9: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ త్వరగా పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి, ములుగు అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, సీహెచ్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయా కలెక్టరేట్‌లలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి వారు ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన 25 దరఖాస్తులను పరిష్కారం కోసం అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు. ఇందు కోసం ప్రతి శాఖలో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించుకోవాలని సూచించారు. ములుగు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 35 దరఖాస్తులు రాగా రెవెన్యూ 13, పింఛన్ 1, ఇందిరమ్మ ఇండ్లకు 5, ఉద్యోగ ఉపాధి కోసం 2, ఇతర శాఖలకు 14 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. అధికారులు దరఖాస్తులపై దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, సంపత్‌రావు, ఆర్డీవోలు మంగీలాల్, వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల వెల్లువ

ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న మత్స్య సొసైటీ సభ్యులు

ఏటూరునాగారం, డిసెంబర్ 9 : ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. పీవో చిత్రామిశ్రా వినతిపత్రాలు స్వీకరించారు. సకాలంలో వినతులు పరిష్కరించే విధంగా చూడాలని సంబంధితశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో 700 మంది గిరిజనులు చెరువుల్లో చేపలు పట్టుకుని జీవిస్తున్నారని, వారందరికీ ఐటీడీఏ ద్వారా వలలు, తెప్పలు, శీతల యంత్రాలు, నావలు, ద్విచక్ర వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలని గిరిజన మత్స్య సంఘాల అధ్యక్షుడు సిద్దబోయిన సురేందర్, గుమ్మడి నర్సయ్య, ఆలం శ్రీను పీవోకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని చెల్పాక గ్రామానికి చెందిన చాట్ల సమ్మక్క ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాపుస్తకాలు ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు. ఆకులవారి ఘనపూర్‌కు చెందిన ఆదివాసీ ఇసుక సొసైటీ నిర్వహణ కోసం ఈసం రాజు దరఖాస్తు అందజేశారు. మంగపేట మండలం పగిడిపల్లికి చెందిన బద్దుల లక్ష్మి గ్రామంలో సీసీ రోడ్డు మంజూరు చేయాలని పీవోకు విన్నవించారు. జలగలంచ గొత్తికోయ గ్రామంలో స్కూల్ ఏర్పాటు చేయాలని భూపాలపల్లికి చెందిన సంజీవకుమార్ కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఆదివాసీ తెగల సమ్మేళన బిల్లు ఇప్పించాలని తుడుందెబ్బ నాయకుడు వట్టం ఉపేందర్ కోరారు. మంగపేట మండలం శనిగకుంటలో ఊర చెరువు మరమ్మతు చేపట్టాలని తాటి నర్సింహారావు కోరారు. బోరు నర్సాపూర్‌లోని పట్టా భూముల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని తాటి నాగరాజు కోరారు. భూపాలపల్లి జిల్లా నందిగామ గ్రామానికి చెందిన సీహెచ్ రాజయ్య పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని విన్నవించారు. రేగొండ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బానోత్ రాములు, బానోత్ వసంత గిరివికాస్ కింద బోర్లు మంజూరు చేయాలని కోరారు.

మాజీ సర్పంచుల అరెస్టు

పోలీస్ స్టేషన్లకు తరలింపు

ములుగురూరల్/ తాడ్వాయి/ గోవిందరావుపేట, డిసెంబర్ 9 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లో మాజీ సర్పంచులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న వారిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వారిని ములుగు, తాడ్వాయి, గోవిందరావుపేట పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ తమకు పెండింగ్ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నిరసన రూపంలో సమస్యను వివరించేందుకు వెళ్తుంటే అరెస్టు చేయడం సరికాదన్నారు. గ్రామాల అభివృద్ధికి తాము అప్పులు చేసి పనులను చేశామని, తమకు రావాల్సిన బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా మానసిక క్షోభకు గురిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులో మాజీ సర్పంచులు చిడం బాబురావు, గొంది శ్రీధర్, గడ్డం అరుణ, పుల్లూరి గౌరమ్మ, జాజ చంద్రం, గుర్రం సమ్మిరెడ్డి ఉన్నారు.

తాడ్వాయి: పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

గోవిందరావుపేట : పస్రా పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్

ఆరోగ్యమందిర్‌ను పరిశీలించిన వైద్యాధికారులు

వెంకటాపూర్, డిసెంబర్ 9 : మండలంలోని జవహర్‌నగర్ గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్‌ను వైద్యాధికారులు పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్కీం కింద సెలెక్ట్ అయిన సందర్భంగా సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్, జిల్లా పోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, స్టేట్ ఎన్క్వాస్ కన్సల్టెంట్ విజయలక్ష్మి, డీపీవో చిరంజీవితో కలిసి సెంటర్‌లోని రూములు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతీయ నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్ పొందడానికి 14 రకాల డయాగ్నోస్టిక్ టెస్టు కిట్లు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, సెంటర్ చుట్టూ ప్రహరీ, ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లయ్ తదితర మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా క్వాలిటీ మేనేజర్ శరత్, మిడ్ లెవెల్‌హెల్త్ ప్రొవైడర్ సంఘమిత్ర, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపవైద్యారోగ్యశాఖ అధికారి విపిన్ కుమార్

గ్రంథాలయాన్ని వెంటనే పునఃప్రారంభించాలి

కృష్ణకాలనీ, డిసెంబర్ 9: జిల్లా కేంద్రంలోని టీ-2 క్వార్టర్స్‌లో మూసేసిన గ్రంథాలయాన్ని వెంటనే పునః ప్రారంభించాలని అధికారులను సోమవారం ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగుల అరవింద్ ఒక ప్రకటనలో కోరారు. 15 ఏండ్ల నుంచి గ్రంథాలయానికి ప్రతిరోజూ అనేక మంది నిరుద్యోగులు వచ్చి పరీక్ష పోటీలకు చదువుకొని ఉద్యోగాలు సంపాదించారన్నారు. అంతేకాకుండా అక్కడి ప్రజలు సైతం వచ్చి పత్రికలు చదువుకునే వారన్నారు. కానీ, కొంతకాలంగా గ్రంథాలయాన్ని మూసి ఉంచడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని మళ్లీ ప్రారంభించి పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న దిలీప్

ములుగురూరల్, డిసెంబర్ 9 : ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు వీ దిలీప్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలో టీపీటీఎఫ్ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపడుతున్న దీక్షకు ఆయన సోమవారం మద్దతు తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు లేకుండా విద్యా కార్యాలయాలు నడవలేని స్థితిలో ఉన్నాయన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగుల నియామకం రాజ్యాంగ హక్కుల స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ములుగు ప్రాంతానికి చెందిన మంత్రి సీతక్క గతంలో చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపి ప్రభుత్వం వస్తే క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు టైం స్కేల్ ఇప్పించేలా కృషి చేయాలని కోరారు.

నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

ములుగురూరల్, డిసెంబర్ 9 : పత్తి మిల్లుల్లో నిల్వలు అధికంగా ఉన్నందున నేడు, రేపు రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి ఆర్ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి కొనుగోళ్లు యథావిధిగా చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

టీ గ్లాస్‌లతో సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

టీ గ్లాస్‌లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చాయ్ తాగి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట టీ కప్పులతో నిరసన తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్, ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కంకల రాజయ్య మాట్లాడారు. 18 ఏండ్లుగా శ్రమదోపిడీకి గురైన సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది వరంగల్‌లో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనకు నాడు రేవంత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాల్లోపు తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ చాంద్‌పాషా, తోకల వేణు, మహిళా అధ్యక్షురాలు చల్ల సునీత, మారం మహేందర్‌రెడ్డి, సుదర్శన్, హేమ, నరేశ్‌కుమార్, రాజు, తిరుపతి, మల్లికార్జున్, శ్రీనివాస్, హరీశ్, కుమార్, శశికళ, శ్రీవాణి, సృజన పాల్గొన్నారు.

కార్యదర్శులతో సర్వేలు చేయించడం సరికాదు

తాడ్వాయి : వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మల్హర్/ మహదేవపూర్/ తాడ్వాయి, డిసెంబర్ 9 : వివిధ శాఖలకు సంబంధించిన పనులను కూడా సర్వేల పేరుతో కార్యదర్శులను అవిశ్రాంతంగా పని చేయించడం సరికాదని టీపీఎస్ఎఫ్ మల్హర్ మండల అధ్యక్షుడు చెల్కల రాజు, కార్యదర్శుల తాడ్వాయి మండల అధ్యక్షుడు రేగ రాజశేఖర్ అన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆయా మండలాల ఎంపీడీవోలు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, సుమనవాణిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన అనేక పనులను పనిభారంతో పాటు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, సకాలంలో ఓపీఎస్‌లకు జీతాలను చెల్లించాలని తెలిపారు. డైయిలీ వర్క్ చేసేందుకు టాప్‌లను అందించాలని, క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయించాలని, జేపీఎస్, ఓపీఎస్ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రొహిబిషన్ పీరియడ్ 4నుంచి రెండేళ్లకు తగ్గించి గడిచిన కాలాన్ని సర్వీస్ కాలం కింద గుర్తించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శులు మల్లికార్జున్, సతీశ్, సాయిచరణ్, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, దేవేందర్‌రెడ్డి, శరత్ చంద్ర, సునీత, రజిత, సమ్మయ్య, మంసూర్, రమేశ్, దామోదర్‌రెడ్డి, సృజన్, అంజలిరెడ్డి, సతీశ్, కొర్నిబెల్లి సతీశ్, చందూలాల్, సునీత, రమేశ్, శారద, ప్రశాంతి, రమేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడలు

మంగపేట, డిసెంబర్ 9 : మండలంలోని తిమ్మంపేట హైస్కూల్ గ్రౌండ్‌లో నేటి నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భద్రు, ఎంఈవో మేనక సోమవారం తెలిపారు. మండలంలోని 25 పంచాయతీల్లో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో విజేతలైన వారికి మండల స్థాయిలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

నేడు బేస్‌బాల్ క్రీడాకారుల సెలక్షన్

ములుగురూరల్, డిసెంబర్ 9 : జిల్లా కేంద్రంలోని సన్‌రైజర్స్ హై స్కూల్ ఆధ్వర్యంలో నేడు బేస్ బాల్ సీనియర్ క్రీడాకారుల సెలెక్షన్స్ జరగనున్నట్లు కరస్పాండెంట్ పెట్టం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలని, ఎంపికైన వారు మహబూబాద్‌లో ఈ నెల 13,14,15 తేదీల్లో జరిగే అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9908898368 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తులు..

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ : చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యనభ్యసిస్తూ ఉపకారం పొందడానికి జిల్లాలోని అర్హులైన మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో 1 ఆగస్టు 2024 నుంచి 31 డిసెంబర్ 2024 వరకు ప్రవేశం పొందిన విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా డిసెంబర్ 31 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

టేకుమట్ల, డిసెంబర్ 9 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలుగు, ఇంగ్లిష్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ పూర్తిచేసి టెట్ క్వాలిఫై అయిన మహిళా అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఈనెల 10నుంచి 11వరకు పాఠశాలలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

రాంనగర్ కాలనీలో క్షుద్రపూజల కలకలం

చిట్యాల, డిసెంబర్ 9: మండలకేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఆరెపల్లి ఎల్లయ్య ఇంటి సమీపంలో పసుపు, కుంకుమ, రక్తం, నిమ్మకాయల ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అటు వైపు వెళ్లడానికి జంకుతున్నారు.

రాష్ట్రస్థాయి స్విమింగ్ విజేతలు వీరే..

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 9 : భూపాలపల్లి పట్టణంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమింగ్ పోటీల్లో బాలుర విభాగంలో వర్షిత్, సాత్విక్, అబ్దుల్ అహ్మద్ ఇసాన్, బాలికల విభాగంలో అతిథి, జహ్నసింజు, అభినయ జానవి ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని స్విమింగ్ అసోసియేషన్ సభ్యులు పైడిపల్లి రమేశ్, జల్ది రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారిని పలువురు క్రీడాకారులు అభినందించారు.

కారు ఢీకొని విశ్రాంత కార్మికుడు మృతి

శంకర్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 9: పట్టణంలోని మైసమ్మ గుడి ప్రాంతంలో జాతీయ రహదారిపై కారు ఢీకొని విశ్రాంత కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. జీఎం కార్యాలయం ఎదుట ఎంసీ క్వార్టర్స్‌లో బొద్దుల శంకర్ (55) ఉంటూ 6 ఇంక్లైన్ గనిలో హెడ్ ఓర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ నాలుగు నెలల క్రితం అన్‌ఫిట్ అయి తన కుమారుడికి ఉద్యోగం పెట్టించాడు. సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై మంజూర్‌నగర్‌కు వెళ్లి తిగిరి వస్తుండగా మైసమ్మ గుడి ప్రాంతంలో కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. బైక్ పైనుంచి శంకర్ కింద పడడంతో అతనిపై నుంచి కారు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే సింగరేణి దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రస్థాయికి మూడు ప్రాజెక్టులు ఎంపిక

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 9 : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భూపాలపల్లి బిట్స్ పాఠశాల విద్యార్థులు పీ రశ్మిత, ఏ శ్రీమాన్య తయారు చేసిన చేసిన నాచురల్ ఫామింగ్ అనే తీమ్‌పై ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం, జీ హర్షవర్ధన్, వీ నిషంత్, బీ వైష్ణవి తయారు చేసిన బయోగ్యాస్ యుటిలిటీ ఫర్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మహ్మద్ నాఫియా ఆనం, షేక్ హజర తయారు చేసిన హౌటుడు ఎల్ సీఎం ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ రెడ్డి, హెచ్ఎం రాజేశ్‌కుమార్ అభినంధించారు.

పత్తి లోడ్ ట్రాక్టర్ బోల్తా

మహదేవపూర్, డిసెంబర్ 9 : మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై అదుపుతప్పి పత్తి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన చల్ల మహేశ్‌కు చెందిన సుమారు 30 క్వింటాళ్ల పత్తిని అదే గ్రామానికి చెందిన డ్రైవర్ మహేశ్ ట్రాక్టర్ లోడ్ చేసుకొని మల్హర్ మండలంలోని కొమ్మార్ పత్తి మిల్‌కు తీసుకెళ్లాడు. పత్తి తేమ ఉందని తెలపడంతో చేసేదిలేక తిగిగి వస్తుండగా మండలకేంద్రంలోని బొమ్మాపూర్ క్రాస్ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఏజెన్సీలో పోలీసుల హై అలర్ట్

పలు మండలాల్లో వాహనాల తనిఖీ

వాజేడు : టేకులగూడెం శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు/ మంగపేట/ వెంకటాపూర్/ వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 9 : మావోయిస్టులు తలపెట్టిన బంద్ నేపథ్యంలో ములుగు జిల్లా ఏజెన్సీలో పోలీసులు హై అలర్ట్ అయ్యారు. సోమవారం వాజేడు, మంగపేట, వెంకటాపూర్, వెంకటాపురం(నూగూరు) మండలాల్లోని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలతో పాటు ఆయా మండలాల్లోని రహదారులపై వాహన తనిఖీలు చేపట్టారు. బ్యాగులు తీసి క్షుణంగా సోదాలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తారసపడిన వారిని ఆపి పూర్తి వివరాలు తెలుసుకున్నాకనే పంపించారు. మరోవైపు అటవీ ప్రాంతాల్లో ఉన్న వివిధ గొత్తికోయల గూడేలు, గోదావరి పెర్రీ పాయింట్లపై కూడా పోలీసులు ప్రత్యేక నజర్ పెట్టి, కొత్తవారి సంచారం ఏమైనా ఉందా? అనే కోణంతో ఆరా తీశారు. తనిఖీల్లో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, వెంకటాపూర్ ఎస్సై సతీశ్, వెంకటాపురం(నూగూరు) ఎస్సై తిరుపతిరావు, సివిల్, టీఎస్‌పీఎస్సీ పోలీసులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

మావోయిస్టులు తలపెట్టిన బంద్ ఆయా మండలాల్లో ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో వ్యాపారులు దూకాణాలు మూసివేసి బంద్ పాటించారు. ఆటోలు ఎదావిధిగా తిరిగాయి. బంద్‌తో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా, మంగపేట మండలంలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు.

సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

ములుగురూరల్, డిసెంబర్ 9 : ఈ నెల 11న ప్రారంభం కానున్న సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ పిలుపునిచ్చారు. సోమవారం జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని సమస్త యాజమాన్య పాఠశాలలు తీమ్‌కు ఒకటి చొప్పున ప్రతి పాఠశాల నుంచి ఆరు ఎగ్జిబిట్లు విధిగా ప్రదర్శించాలని సూచించారు. ఇన్‌స్పెయిర్ మనక్‌కు ఎంపికైన 23 పాఠశాలలు విధిగా ఎగ్జిబిట్లను ప్రదర్శించాలని సూచించారు. జిల్లా డీసీఈబీ కార్యదర్శి ఇనుగాల సూర్యనారాయణ, కళాశాల పిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎంఈవోలు సామల శ్రీనివాస్, దివాకర్, కేశవరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం కప్ కోసం సమన్వయ సమావేశం

కాటారం, డిసెంబర్ 9 : సీఎం కప్ నిర్వహణ కోసం కాటారం జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాబు తెలిపారు. మండలంలోని పీడీలు, పీఈటీలు హాజరు కావాలని కోరారు. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో కాటారంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడలకు అందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు.

మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్

మహదేవపూర్ : టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను అందజేస్తున్న ఎంఈవో ప్రకాశ్‌బాబు

చిట్యాల/ మహదేవపూర్/ కాటారం, డిసెంబర్ 9 : తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో చిట్యాల, మహదేవపూర్ పాఠశాలల్లో సోమవారం మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎంఈవోలు కోడెపాక రఘుపతి, ప్రకాశ్, మండల శాఖ కన్వీనర్ సమ్మయ్యనాయక్, కో-కన్వీనర్ కిషన్ నాయక్ పరిశీలించారు. చిట్యాల మండలంలో 14 మంది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలైన కే కీర్తి ప్రథమ, కే స్రవంతి ద్వితీయ స్థానంలో నిలవగా ఎంఈవో బహుమతులు అందజేశారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ అందజేశారు. బయో సైన్స్ ఫోరం కన్వీనర్లు కూచనపల్లి శ్రీనివాస్, బిట్ల సరళాదేవి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీరామ్ రఘుపతి పాల్గొన్నారు. మహదేవపూర్ మండలంలో ఇంగ్లిష్ మీడియంలో విఘ్నేశ్‌కు ప్రథమ స్థానం, అభినేశ్వరికి ద్వితీయ స్థానం, తెలుగు మీడియంలో అలేఖ్య ప్రథమ స్థానం, వంశీకృష్ణ ద్వితీయ స్థానం, కాటారంలో ఆంగ్ల మాధ్యమంలో జే వర్షిత్ ప్రథమ, ఆత్మిక ద్వితీయ, తెలుగు మాధ్యమంలో కీర్తన, విజయ్ ప్రథమ స్థానం సాధించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులు ఈ నెల 18న జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో కాటారం ఎంఈవో శ్రీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు ఆంగోత్ రవీందర్, గండు రాజబాబు, చింతల విజయ, జ్యోతి, పుష్పలీల, దారం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'అభయహస్తం' అమలేది..?

చిట్యాల, డిసెంబర్ 9 : అభయ హస్తం పథకం అమలు చేసి దళిత కుటుంబాలకు అందించాలని రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితుల అభ్యున్నతికి నాటి సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ఎన్నికల ముందుకు కాంగ్రెస్ అబయ హస్తం పథకం ప్రవేశపెట్టి దళితులను ఆదుకుంటామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవ సభలు ఎలా జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. తక్షణమే పథకం అమలు చేసి దళిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.